క్లుప్తంగా

వేషాలమ్మ ఆలయంలో ఆర్‌ఓ ప్లాంట్



ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాతలు డాక్టర్ సుకుమార్, డాక్టర్ సుధారాణి

తిరుపతి కల్చరల్: వేషాలమ్మ ఆలయానికి ఆదివారం డాక్టర్ సుకుమార్, డాక్టర్ సుధారాణి దంపతులు ఆర్‌ఓ ప్లాంట్‌ను అందజేశారు. ఆలయ సిబ్బందితోపాటు భక్తులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో దాతలు ఆలయంలో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

పాకాల: ఆర్టీసీ బస్టాండ్ వద్ద పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం కేవీపీఎస్ మండల కార్యదర్శి రవి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సీపీఎం సీనియర్ నాయకుడు మధుసూదన్ రావు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య పేద ప్రజల సమస్యలపై, కులవివక్షపై నిత్యం పోరాటాలు సాగించారని కొనియాడారు. నిరంతరం ఆయన ఆశయాలను కొనసాగించేందుకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌బాబు, హరిప్రకాష్, పెనుమూరు రవి, ఆనంద, రాజు, దేవేంద్ర, వెంకటరమణ, సుబ్రమణ్యం, కేశవరెడ్డి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

చంద్రగిరి(తిరుచానూరు): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నాట్యం ప్రేక్షకులను అలరించింది. తిరుపతికి చెందిన జయశ్రీ డ్యాన్స్ అకాడమీ నాట్య గురువు జయశ్రీ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నాట్యం విశేషంగా ఆకట్టుకుంది. వివిధ పాటలకు కళాకారులు కార్తీక శ్రీనిధి, విభదీక్షిత, ప్రణవి, కోవిద వర్మ, శాలిని, జాహ్నవి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులను ఏఓ ఖాదర్‌వల్లీ సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి పరదా కానుక



తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకొని తిరుపతికి చెందిన భక్తుడు పరదాల మణి ఆదివారం అమ్మవారి ఆలయానికి పరదా సమర్పించారు. ఈ సందర్భంగా పరదాల మణి మాట్లాడుతూ తిరుపతి గ్రామదేవత, తిరుమల శ్రీవారికి స్వయాన చెల్లెలుగా భాసిల్లుతున్న గంగమ్మ తల్లి జాతర సందర్భంగా గత 20 ఏళ్లుగా పరదా సమర్పించడం మహద్భాగ్యంగా భావిస్తున్నట్లు తెలిపారు.

బ్రాహ్మణకాల్వకు రాని సిట్ బృందం

రామచంద్రాపురం: ఎన్నికల సందర్భంగా జరిగిన దాడులపై నివేదిక ఇవ్వాలని ఈసీ సిట్ బృందాన్ని ఏర్పాటు చేసింది. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా బ్రాహ్మణకాల్వ పోలింగ్ కేంద్రం వద్ద ఘర్షణ చోటుచేసుకోవడంతో సీఆర్పీఎఫ్ జవాన్ కాల్పులు జరిపాడు. ఈ నేపథ్యంలో ఆదివారం బ్రాహ్మణకాల్వ గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించి సిట్ బృందం వస్తుందని గ్రామస్తులను అప్రమత్తం చేశారు. అయితే సిట్ బృందం కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లి గ్రామాల్లో పరిశీలించి వెనుదిరిగింది. ఉదయం నుంచి సిట్ బృందం వస్తే తమ గోడు చెప్పుకోవాలని ఎదురుచూసిన బ్రాహ్మణకాల్వ గ్రామస్తులకు నిరాశే ఎదురైంది.

వాహనం ఢీకొని జింక మృతి

తిరుమల: మొదటి ఘాట్‌రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఏడో మైలు వద్ద ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో రోడ్డును జింక దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో జింక అక్కడికక్కడే మృతి చెందింది. వెంటనే సమాచారం అందుకున్న టీటీడీ అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని జింక కళేబరాన్ని తరలించారు.



శోభాయాత్రలో కళాకారులతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష



భక్తులకు గంధం పూసి, కుంకుమ బొట్లు పెడుతున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి



ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌కి గంధం పూస్తున్న మహిళలు



భక్తి చైతన్య సంబరం

- వేడుకగా గంగమ్మ శోభాయాత్ర
- జానపద కళారూపాలు, వేషాలతో హోరెత్తిన పురవీధులు



భక్తి చైతన్య శోభాయాత్రలో అశేష భక్తజనం



కళాకారుల నృత్య ప్రదర్శన

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా ఆదివారం సాయంత్రం తిరునగరిలో చేపట్టిన గంగమ్మ భక్తి చైతన్య శోభాయాత్ర సంబరం అంబరాన్నంటింది. సాంప్రదాయబద్ధంగా గంగ జాతరలో భక్తులు వేసే వేషాలను ఆవిష్కరిస్తూ ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన గంగమ్మ జాతరకు పూర్వ వైభవం కల్పించాలనే సంకల్పంతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సారథ్యంలో భక్తి చైతన్య యాత్ర అంగరంగవైభవంగా చేపట్టారు. అనంతవీధికి ఉన్న ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకొని అక్కడి నుంచి ఈ గంగమ్మ భక్తి చైతన్య యాత్రను చేపట్టారు. తిరుమలకు ముఖద్వారమైన అనంతవీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష యాత్రను ఆరంభించారు. యాత్రలో పాల్గొన్న వారందరికీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి, మేయర్ శిరీష గంధం, పసుపు, కుంకుమ పూస్తూ సందడి చేశారు. భక్తులు సైతం స్వయంగా గంధం బొట్టు పెట్టుకొని, వేపాకు కొమ్మలు చేతపట్టి జై గంగమతల్లి అంటూ నినాదాలు చేస్తూ భక్తి చైతన్య యాత్రలో కదం తొక్కుతూ అమ్మవారిపై తమ భక్తి విశ్వాసాలను చాటుకున్నారు. అనంత వీధి నుంచి ఆరంభమైన ఈ గంగమ్మ భక్తి చైతన్య యాత్ర రామచంద్ర పుష్కరిణి, మహతి కళాక్షేత్రం, టౌన్ క్లబ్, ప్రకాశం రోడ్డు, గాంధీరోడ్డు, బండ్ల వీధి, హెడ్ పోస్టాఫీస్ మీదుగా అమ్మవారి ఆలయం వరకు సాగింది. వారం రోజుల క్రితం నగరమంతటా ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలు సైతం భక్తి చైతన్య యాత్రలో ఊరేగింపుగా సాగాయి. యాత్ర ఆద్యంతం జానపద కళారూపాల ప్రదర్శనలు, జానపద, పౌరాణిక, చారిత్రక వేషాలు, కోలాటాలు, సన్నాయి మేళాలు, డప్పుల మోతల నడుమ కోలాహలంగా భక్తి చైతన్య యాత్ర సాగింది. యాత్రకు దారి పొడవునా భక్తులు హారతులు సమర్పిస్తూ, కొబ్బరి కాయలు కొడుతూ తమ భక్తిని చాటుకున్నారు. శోభాయాత్రలో సాగుతున్న అతిథులకు పూలమాలలు వేస్తూ పుష్పవర్షం కురిపించారు. గంగమ్మ భక్తి చైతన్య యాత్రలో పాల్గొన్న భక్తులకు, కళాబృందాలకు దారిపొడవునా మజ్జిగ, వాటర్ బాటిళ్లు అందించారు. ఆలయానికి చేరుకున్న భక్తి చైతన్య యాత్రకు అర్చకులు స్వాగతం పలికి ఆహ్వానించారు. అతిథులు అమ్మవారిని దర్శించుకోవడంతో గంగమ్మ భక్తి చైతన్య యాత్ర ముగిసింది. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, టౌన్ బ్యాంక్ చైర్మన్, డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు, సీనియర్ నేతలు, నాయకులు, నగర ప్రముఖులు, నగర ప్రజలు పాల్గొన్నారు.







అమ్మవారి సేవలో డెప్యూటీ మేయర్, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్, అభినయ్‌తో సెల్ఫీలు, శోభాయాత్రలో వివిధ కళాప్రదర్శనలు, వేషధారణలో కళాకారులు, భక్తులు

గంగమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు




గంగమ్మ తల్లి సేవలో కమిషనర్ అదితిసింగ్, కుటుంబ సభ్యులు, ఆలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అదితిసింగ్

- మెరుగైన పారిశుధ్యం, అత్యవసర మెడికల్ క్యాంప్
- అమ్మవారి దర్శనానికి భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు
- జాతర రోజు భక్తులకు అవసరమైన సౌకర్యాలు
- కమిషనర్ అదితి సింగ్ వెల్లడి

తిరుపతి కల్చరల్: అత్యంత వేడుకగా నిర్వహిస్తున్న తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ భద్రత, సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గంగమ్మ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేయనున్న నేపథ్యంలో ఆలయం వద్ద పటిష్ఠ భద్రత, ఆలయంలో క్యూలైన్లు, ఆలయం, పరిసర ప్రాంతాలలో పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యాల ఏర్పాటు తదితర అంశాలపై ఆయా శాఖ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ గంగ జాతర ఉత్సవాలపై, అలాగే మంగళవారం జరుగనున్న శ్రీతాతయ్యగుంట గంగ జాతరకు పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆలయంలో క్యూలైన్ల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాలు, చుట్టు పక్కల పారిశుధ్యం మెరుగు కోసం చర్యలు చేపట్టామని, బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు తెలిపారు. ఆలయం లోపల అత్యవసర మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడంతోపాటు ప్రత్యేక వైద్య సిబ్బంది ఏర్పాటు చేశామని, అత్యవసర వైద్య చికిత్స సేవలకు అంబులెన్స్ కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తులకు తాగునీరు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జాతర ఉత్సవాల్లో విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రహదారులపై భక్తులకు ఇబ్బంది కలిగించే ఆక్రమణలను తొలగించామన్నారు. తిరుపతి గంగ జాతరలో మంగళవారం ప్రజలందరూ సహకరించాలని కోరారు. అనంతరం కమిషనర్ అదితి సింగ్ తమ కుటుంబ సభ్యులతో కలిసి గంగమ్మ తల్లిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం ఈఓ కె.మమత, అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, ఫైర్ అధికారి శ్రీనివాసరావు, డీఈ సంజయ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, ఎలక్ట్రికల్ ఏఈ నరేంద్ర పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శివలీలలు పౌరాణిక నాటకం



కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా రేణిగుంట శ్రీవినాయక నాట్య మండలి వారు ఆదివారం రాత్రి ఇందిరామైదానంలో కళా వేదికపై ప్రదర్శించిన శివ లీలలు పౌరాణిక నాటకం భక్తులను ఆకట్టుకుంది. ఈ నాటకానికి సంగీతం కృష్ణమూర్తి, నేపథ్య గానం బాల గంగాధర తిలక్ సమకూర్చగా కళాకారులు కె.నాద మునిరెడ్డి, ఎం.సురేష్, ఎస్.కోదండపాణి, విజయబాబు, కేశవరెడ్డి, రాధాకృష్ణ, భాస్కర్‌రెడ్డి, గోపాల్, సుబ్బారెడ్డి, శోభ, యశోద, హరిప్రియ అద్భుతంగా నటించారు. నిర్వాహకుడు అభినయ ఆర్ట్స్ బీఎస్.రెడ్డి, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, ఎస్.కృష్ణమూర్తిరెడ్డి కళాకారులను సత్కరించి అభినందించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



ఉమర్‌ఫరూఖ్ (ఫైల్)

తిరుపతి రూరల్: పాకాల పట్టణానికి చెందిన ఉమర్‌ఫరూఖ్ అనే వ్యక్తి గత 15 రోజుల నుంచి కనిపించడం లేదని అతని భార్య తస్లీమభాను ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పాకాల పోలీసులు తెలిపారు. ఉమర్‌ఫరూఖ్ ఈ నెల 3వ తేదీన సాయంత్రం తన తల్లితో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లి పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నాటి నుంచి బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేదని, చివరకు ఈ నెల 15వ తేదీన ఉమర్‌ఫరూఖ్ భార్య ఫిర్యాదు మేరకు పాకాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పాకాల ఏఎస్‌ఐ వెంకటరత్నం తెలిపారు. ఉమర్‌ఫరూఖ్ ఆచూకీ తెలిసిన వారు 62810 29356, 89192 55329 నెంబర్ల ద్వారా సమాచారం అందించాలని కోరారు.

హెచ్‌ఐవీ బాధితులను ప్రేమతో ఆదరించాలి



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న అధికారులు

తిరుపతి తుడా: సమాజంలో హెచ్‌ఐవీ బాధితులను ప్రేమతో ఆదరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా తిరుపతిలో కొవ్వొత్తుల ర్యాలీని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి టౌన్ క్లబ్ వరకు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ హెచ్‌ఐవీ–ఎయిడ్స్‌తో చనిపోయిన వారికి సంఘీభావం తెలియజేయాలని.. వారి కుటుంబ సభ్యుల బాధను నయం చేద్దామని కోరారు. కార్యక్రమంలో ఎస్వీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పీపీ చంద్రశేఖర్, రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్–టీబీ అధికారిణి డాక్టర్ హరిత, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మృదులవాణి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా వి.హర్షవర్ధన్ రాజు బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

– తిరుపతి అర్బన్

కమనీయం ద్రౌపది కల్యాణం



యడమవారిపల్లె మహా భారత ఉత్సవాల్లో శ్రీ ద్రౌపది కల్యాణం



విశేషాలంకరణలో శ్రీ ద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి వారు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం యడమవారిపల్లె మహా భారత ప్రాంగణంలో చేపట్టిన 73వ మహా భారత ఉత్సవాలలో శ్రీ ద్రౌపది కల్యాణం కమనీయంగా సాగింది. ఆదివారం మధ్యాహ్నం జరిగిన శ్రీ ద్రౌపది కల్యాణం వేడుకలు ఆలయ ప్రాంగణలో వేసిన పచ్చని పందిళ్ల కింద వేద మంత్రోచ్చారణ మధ్య సాగింది. శ్రీ ద్రౌపది కల్యాణానికి ముక్కోటి దేవతలు, మునులు, సామంతులు, రాజులు, కవులను ఆహ్వానించారు. పంచ పాండవుల పెళ్లి జరిగేటప్పుడు చేపట్టే ఏర్పాట్లను మహా భారత ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రాలతో జరిగే కల్యాణాన్ని భక్తులు తిలకించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు అమ్మవారికి తలంబ్రాలు పోసి తమ మనసులోని కోర్కెలను కోరుకున్నారు. అలాగే కోరిన కోర్కెలు నెరవేరిన భక్తులు అమ్మవారికి వడిబాల కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మహా భారత ఉత్సవాల్లో ద్రౌపది మాతకు వడిబాల కట్టడడం కోసం మహిళలు చాలా భక్తి శ్రద్ధలతో వచ్చి కార్యక్రమాన్ని చేపడుతారు. ద్రౌపది మాత కల్యాణానికి వచ్చిన భక్తులందరికి శ్రీ ద్రౌపది దేవి ధర్మరాజుల స్వామి అన్నదానం సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సైతం అమ్మవారి కల్యాణాన్ని తిలకించి చదివింపులు ఇచ్చారు. కార్యక్రమానికి ఈ ఏడాది ఉభయ దాతలుగా ముద్దుక్రిష్ణయ్య, భారతమ్మ, ఉమాపతి, క్రిష్ణయ్య, జ్యోతినాథ్, రెడ్డిరాణి, గురుమోహన్ వ్యవహరించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు రూ.1116 చెల్లించి పాల్గొన్నారు. కల్యాణానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆదర్శప్రాయుడు నీలం సంజీవరెడ్డి



మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి అవార్డును అందుకున్న ప్రముఖులు

తిరుపతి అర్బన్: నేటితరం పాలనావేత్తలకు ఆదర్శప్రాయుడు మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి అంటూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ అభివర్ణించారు. ఆదివారం భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ (అగ్రశ్రీ) ఆధ్వర్యంలో భారత 6వ రాష్ట్రపతి, యునైటెడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 111వ జయంతి వేడుకలను తిరుపతిలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించారు. అగ్రశ్రీ వ్యవస్థాపక సంచాలకుడు డాక్టర్ డి.సుందర రామ్ మాట్లాడుతూ నిస్వార్థ సేవలను అందించిన నీలం సంజీవరెడ్డి పేరిట స్మారక ఉపన్యాసాన్ని, రాష్ట్ర స్థాయి పురస్కారాలను ప్రముఖులకు అందజేశామన్నారు. ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ మాజీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ జి.యతిరాజులు, అగ్రశ్రీ సహ వ్యవస్థాపకురాలు డి.భారతి సుందర్, అగ్రశ్రీ పాలకమండలి సభ్యులు డి.సుచరిత, ఆచార్య ఎం.రఘురామరెడ్డి, ఆచార్య వి. వనజక్షమ్మ, డి.సాయి కుమార్, ఎస్.నవీన్ కుమార్, డాక్టర్ ఎస్. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూరో సర్జరీలో సరికొత్త మార్పులు



అపోలో న్యూరో సర్జన్ డాక్టర్ ఎం. బాలమురుగన్

తిరుపతి తుడా: న్యూరోసర్జరీ నిరంతరం అభివృద్ధి చెందుతోందని.. అనేక సంవత్సరాలుగా శస్త్రచికిత్సా విధానాలు, ఇమేజింగ్‌లలో గణనీయమైన పురోగతి సాధించిందని అపోలో హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్, న్యూరో సర్జన్ డాక్టర్ ఎం.బాలమురుగన్ తెలిపారు. లక్ష్మీపురం సర్కిల్‌లోని అపోలో క్లినిక్‌లో ఆయన ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూరో ఎండోస్కోప్, రోబోటిక్ సిస్టమ్ తదితర ఇటీవలి సాధనాలు, వివిధ వెన్నెముక , ఇంట్రాక్రానియల్ విధానాలలో విజువలైజేషన్, నైపుణ్యాన్ని మెరుగుపరిచాయన్నారు. తద్వారా శస్త్రచికిత్స అనంతరం నొప్పిని తగ్గించి రోగులు ఆసుపత్రిలో ఉండే సమయాన్ని బాగా తగ్గించాయన్నారు. ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ ద్వారా మెరుగైన శస్త్రచికిత్స ఫలితాన్ని సాధించవచ్చునన్నారు. డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్, న్యూరో నావిగేషన్– స్టీరియోటాక్సీ, ఎండోవాస్కులర్ ఎంబోలైజేషన్ టెక్నాలజీ, జీన్ థెరపీ, స్టెమ్ సెల్ రీసెర్చ్ మొదలైన ఇతర పురోగతులు సాధించినట్లు వివరించారు.